ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 02.07.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ తొలి కాగిత రహిత కేబినెట్ సమావేశం జరగనుంది.
2. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు , గత ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , మహ్మద్ అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు విపక్షాలకు ఘాటు సవాల్ విసిరారు. కాగా, గన్ పార్క్ కు వెళ్తున్న పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
3. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితి ఉన్నప్పటికీ సామాన్యులపై భారం పడకుండా ఇంధన సరఫరాపై విధించిన తాత్కాలిక నియంత్రణలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలియజేశారు.
4. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా నిర్వహించేందుకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ "మిషన్ కె-100" అనే సరికొత్త ప్రణాళికను ప్రారంభించింది.

**కేబినెట్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇవాళ తొలి కాగిత రహిత కేబినెట్ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో , మంత్రులకు ఎజెండాను పూర్తిగా డిజిటల్ రూపంలోనే అందించనున్నారు. ఈ కీలక సమావేశంలో వీబీ జీరామ్‌జీ

పథకం అమలుపై మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. అలాగే , ఖరీఫ్ సీజన్ విత్తనాలు, ఎరువుల పంపిణీ, ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. వీటితో పాటు మూసీ పునరుజ్జీవన తొలిదశ పనులు , మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు కూడా ఈ కేబినెట్ వేదికగా ఆమోదం లభించే అవకాశం ఉంది.

**పీటీసీ - హైదరాబాద్**

**వీబీ జీ రామ్ జీ**

తిరుపతిలో వీబీ జీరామ్‌జీ పథకం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ ... గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అందుకే ఈ పథకం కింద ఏడున్నర లక్షల కోట్లు ఖర్చుపెడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి రెండు కోట్ల రూపాయలు అందజేస్తామన్నారు.

డెస్క్

**మంత్రులు**

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు , గత ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , మహ్మద్ అజారుద్దీన్ , జూపల్లి కృష్ణారావు విపక్షాలకు ఘాటు సవాల్ విసిరారు. హైదరాబాద్ గన్ పార్క్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. గురుకులాల కొనుగోళ్లలో మొత్తం టెండర్ల విలువ 1 వెయ్యి 143 కోట్ల రూపాయలు అయితే , మూడు వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ టెండర్లపై న్యాయపోరాటాల కంటే అసెంబ్లీ లేదా ప్రెస్ క్లబ్‌లో బహిరంగ చర్చకు రావాలని మంత్రి అజారుద్దీన్ సవాల్ చేశారు. మరోవైపు , మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కేటీఆర్, హరీష్ రావు లకు సమాధానం చెబుతానంటూ జూపల్లి కృష్ణారావు గన్ పార్క్ వద్దకు చేరుకుని వెనుదిరిగారు.

డెస్క్

**బీఆర్ఎస్**

మరోవైపు.. అప్పుల లెక్కలు, గురుకులాల టెండర్లపై చర్చకు గన్‌పార్క్ బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను పోలీసులు తెలంగాణ భవన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అయితే, ప్రభుత్వం తమను చర్చకు రాకుండా పోలీసులతో అడ్డుకుందని హరీశ్ రావు ఆరోపించారు.

డెస్క్

**కిషన్ రెడ్డి**

పశ్చిమాసియా సంక్షోభం తగ్గుముఖం పట్టడంతో ఇంధన సరఫరాపై విధించిన తాత్కాలిక నియంత్రణలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ అనిశ్చితి ఉన్నప్పటికీ సామాన్యులపై భారం పడకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాలను ఆయన అభినందించారు. రిటైల్ బంకుల్లో రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్ సరఫరా నిబంధనతో పాటు కమర్షియల్ వినియోగదారులపై ఉన్న ఆంక్షలను ఎత్తేసినట్లు చెప్పారు. అలాగే 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను 183 రూపాయల వరకు తగ్గించి వ్యాపారులకు ఊరటనిచ్చారన్నారు.

డెస్క్

**పట్టాలు**

హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద లబ్ధిదారులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు రెండు పడకల గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గతంలో గుడుంబా విక్రయించి, ఇప్పుడు మానేసిన 125 మందికి పునరావాసం కింద ఈ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్యే రాజాసింగ్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

**మిషన్ కె100**

రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా నిర్వహించేందుకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ "మిషన్ కె-100" అనే సరికొత్త ప్రణాళికను ప్రారంభించింది. ఈ కార్యక్రమ ప్రారంభం సందర్భంగా పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్ జి.ఎన్. రాజుతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నిన్న ప్రారంభమైన ఈ 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక ద్వారా.. కొత్త పంట వచ్చేలోపు రాష్ట్రంలోని ధాన్యం నిల్వలు , రవాణా, ఆర్థిక వ్యవస్థలను పూర్తిగా ప్రక్షాళన చేయనున్నారు. ఈ మిషన్‌లో భాగంగా పెండింగ్ ధాన్యాన్ని త్వరగా మిల్లింగ్ చేసి ఎఫ్సీఐకి అప్పగించడం, ధాన్యం వేలం ద్వారా నిధుల సమీకరణ, కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టడం వంటి ఐదు ముఖ్యమైన లక్ష్యాలపై దృష్టి పెట్టారు. ఈ వ్యూహాత్మక ప్రణాళిక అమలుపై కమిషనర్ అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

పీఎస్

**జీ రాంజీ**

వికసిత్ భారత్ జి రామ్ జి పథకంలో నిన్న తొలి రోజు ఉపాధి కూలీలకు పని కల్పించడంలో తెలంగాణ రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి గీత తెలిపారు. ఆకాశవాణితో గీత మాట్లాడుతూ...

బైట్ ... గీత గ్రామీణభివృద్ధి శాఖ అధికారి, కరీంనగర్

పిటిసి, కరీంనగర్

**ఎరువులు**

జిల్లాలో పంటల సాగుకు అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయని , రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ తెలిపారు. రైతులు ఆందోళనకు గురి కావద్దని, సాంకేతిక సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని ఆకాశవాణితో చెప్పారు.

బైట్ - కలెక్టర్ గరీమా అగర్వాల్,

పిటిసి, సిరిసిల్ల

**హరిత**

విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. అగర్వాడ గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై కలెక్టర్ మాట్లాడుతూ...

బైట్ - కలెక్టర్

పిటిసి, ఆసిఫాబాద్

**వాతావరణం**

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడా ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. అలాగే , రాష్ట్రంలోని అనేక జిల్లాలలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు కూడా రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది.

పీఎస్

**అంతర్జాతీయ క్రీడా విలేకరుల దినోత్సవం**

ఈరోజు అంతర్జాతీయ క్రీడా విలేకరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. క్రీడల అభివృద్ధికి , క్రీడాకారుల విజయాలకు, ప్రపంచవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి పాత్రికేయులు అందిస్తున్న సేవలను గుర్తించి , వారిని సత్కరించుకోవడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అంతర్జాతీయ క్రీడా పాత్రికేయుల సంఘాన్ని 1924 జూలై 2న పారిస్ ఒలింపిక్స్ సమయంలో స్థాపించారు. ఈ సంస్థ ఏర్పడిన 70వ వార్షికోత్సవం సందర్భంగా , 1994లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని ప్రకటించారు. అప్పటి నుండి ఏటా ప్రపంచ వ్యాప్తంగా దీన్ని ఆచరిస్తున్నారు.

జీఎస్

**కవిత**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను బోడుప్పల్‌లో భూపోరాట నిరసనల నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య

కవితతో పాటు వందలాది మంది పార్టీ నాయకులు , కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, భద్రతా కారణాల దృష్ట్యా ఆమెను బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పిటిసి, మేడ్చల్

**సీట్లు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈనెల 4న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సి పల్ ప్రభాకరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ లో 18 , సీబీఎంలో 21 , టెక్స్ టైల్ ఫ్యాషన్ టెక్నాలజీలో 21 సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

పిటిసి, సిరిసిల్ల

**గంజాయి**

ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయి సాగు చేస్తూ గతంలో కేసులు నమోదైన 35 మందికి ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా ఆపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**కలెక్టర్**

జిల్లాలో పశుపోషక రైతులకు నాణ్యమైన పశు ఔషధాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతి మండలంలో ఒక జనరిక్ పశు ఔషధ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ... పశుపోషణ రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతున్న నేపథ్యంలో నాణ్యమైన పశు వైద్య సేవలు , తక్కువ ధరల్లో ఔషధాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

పిటిసి, వరంగల్

**ప్రదర్శన**

తెలంగాణ మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 26 వరకు ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ నిర్వహిస్తున్నట్లు , రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు.

పిటిసి, సిరిసిల్ల

**కేంద్రీయ విద్యాలయం**

ములుగు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవ న నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. 2027-28 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పిటిసి, ములుగు

**హరీష్ రావు**

సింగరేణిలో లేని బొగ్గు నిల్వలను ఉన్నట్లు చూపిస్తున్నారని , దీనిపై శాసనసభ సమావేశం ఏర్పాటు చేస్తే ఆధారాలతో నిరూపిస్తానని, నిరూపించకపోతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు అన్నారు.

పిటిసి, మంచిర్యాల